


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మళ్ళీ ఓసారి బాల్యంలోకి....

**మా చిన్నతనంలో** హైదరాబాద్ ఇలా వుండేది కాదు. చలికాలం కప్పుకున్న రగ్గు తొలగించి కాలుకింద గచ్చుమీద పెట్టగానే జివ్వుమనేది. అలాగే పంపు తిప్పితే చన్నీళ్ళకి చేతివేళ్ళు కొంకర్లు పోయినట్టు అయ్యేవి. ఎలాగో అలా పళ్ళు తోముకుని రాగానే, అమ్మమ్మ కుంపటి విసురుతూ, ఒక పొయ్యిమీద పాలుపెట్టి, ఇంకోదానిమీద కాఫీ డికాషన్ తీసేది. కుంపటిలోంచి ఎర్రని నిప్పులు ఇచ్చే వెచ్చదనంతో వేడి వేడి చిక్కని కాఫీ, గుమ్మ పాలతో కలిపి గుటక వేస్తుంటే, అప్పుడే పక్కింటావిడ కబుర్లూ, అమ్మ ఆఫీసు కబుర్లూ అన్నీ చెప్పుకునేవారు. ఇంక నాగ్‌పూర్ నుండి పెద్దమ్మా వాళ్ళు రాత్రి అక్కడ రైలు ఎక్కితే, పొద్దుట కాఫీ వేళకి ఇక్కడ కుంపటిముందు మాయల మరాఠీ వాడి సంచిలోంచి వచ్చినట్లు ప్రత్యక్షం అయ్యేవారు.

ఇలా కబుర్లు చెప్తూనే అమ్మమ్మ పెరట్లోంచి తోటకూరో, చుక్కకూరో, పాదున కాసిన దొండకాయలో, ఆనపకాయో కోసుకొచ్చి, సన్నగా తరిగేది.

పెద్దమ్మ పెట్టె తెరిస్తే అందులోంచి కునేగా సెంట్ వాసనొచ్చేది. అమ్మకోసం చీరలూ, మాకోసం బిస్కెట్లూ లాంటివి వచ్చేవి. తెలుగు రాష్ట్రం వస్తే ముందే పెద్దమ్మా, పెదనాన్నా ఏ హోటల్స్‌కి వెళ్ళాలో.. వెళ్ళి ఏం తినాలో.. ఏ ఏ సినిమాలు చూడాలో, ఏమేం కొనుక్కెళ్ళాలో ప్లాన్ చేసుకుని వచ్చేవారు.

ఇప్పుడు అమెరికాలో కూడా అన్నీ దొరుకుతున్నాయి కానీ అప్పట్లో మహారాష్ట్రలో మన దోసకాయలూ, వక్కపొడీ, కాఫీ పొడీ, తెలుగు పత్రికలూ, తెలుగు సినిమాలూ వుండేవికావు. ఇక్కడకొచ్చి కరువుగా సినిమాలు చూసి, హోటల్‌కి అందులోనూ చిక్కడపల్లి సుధా హోటల్‌కీ, రవీంద్ర భారతి ముందు వుండే గోపీ హోటల్‌కీ, వెళ్ళి ఇడ్లీ తినేవారు. మా నాన్న

అయితే ఆటో రానూ పోనూ మాట్లాడి ఆబిడ్స్‌లో తాజ్ మహల్ హోటల్‌కి తీసుకెళ్ళి మసాలా దోశ, బాసుందీ తినిపించి తీసుకొచ్చేవాళ్ళు మాకు.

పెద్దవాళ్ళు నవ్వుకుంటూ ఫెళ్ళుమని కబుర్లు చెప్పుకుంటూ వుంటే, స్కూల్‌కి వెళ్ళాలంటే చచ్చే ఏడుపుగా ఉండేది నాకు. కానీ మా చుట్టాలు తెచ్చిన కొత్త పెన్సిల్ బాక్సో, కొత్త రిబ్బన్లో చూపించాలంటే మరి బడికి వెళ్ళాలిగా. ముందు రోజే కోసి పెట్టుకున్న చమేలీ పూలదండ జడల్లో పెట్టుకుని, చలికి స్వెట్టర్ కూడా వేసుకుని అక్కర్లేకపోయినా నాలుగు తుమ్ములు తూఛ్ తూఛ్ అని తుమ్మి అమ్మమ్మ మనసు మార్చుకుని 'ఈ పూటకి ఇంట్లో వుండు" అంటుందేమోనని ఆశగా చూస్తూ పెట్టిన కూరముక్కా, అన్నం తినేసి, బడికి వెళ్ళేదాన్ని.

సత్తు టిఫిన్ క్యారేజ్‌తో సందానీగాడు, జారిపోతున్న లాగూ పైకి ఎగదోసుకుంటూ వచ్చి "పొద్దుగాల మీ ఇంటికి చుట్టాలొచ్చినయ్ కదా" అనేవాడు.

"చుట్టాలొచ్చినయ్ ఏంట్రా? దెయ్యాలొచ్చినట్లు? వచ్చారు" అనేదాన్ని కోపంగా.

"ఏం తెచ్చినయ్?" వెంటనే అడిగేవాడు.

దాంతో ఉషారొచ్చి "బోలెడు మిఠాయిలు, కొత్త రిబ్బన్లు, కొత్త గౌన్.." అని చెప్తుంటే,

"అవన్నీ సరే మిఠాయి లెయ్యి" అనేవాడు.

నేను నా ఉత్సాహం ఆవిరి అయిపోయి, బ్యాగ్‌లోంచి పెద్దమ్మ తెచ్చిన బాదుషానో, చాక్లెటో తీసి ఇచ్చేదాన్ని.

"మీ చుట్టాలు మంచియి.. మా చుట్టాలు ఏం తేవు. అన్నీ తిని పోతాయి" అనేవాడు సందానీ.

ఆ పాటికి నేను అన్నం బెల్లుకి ఇంటికొచ్చి, మళ్ళీ స్కూల్‌కి వెళ్ళకుండా ఎలా ఎగ్గొట్టాలా అని దీర్ఘాలోచనలో పడేదాన్ని.

"సంకలో ఉల్లిపాయ పెట్టుకుంటే జొరం వస్తుంది" లాంటి దిక్కుమాలిన ఉపాయాలన్నీ చెప్పేవాడు మిఠాయి తింటూ సందానీ.

నేను అవన్నీ చేసినా ఎప్పుడూ ఫలించలేదు ఆ ఐడియాలు.

ఇంక చేసేదిలేక మధ్యాహ్నం వచ్చే ఫిలోమినా టీచర్‌కీ, సులోచనా టీచర్‌కీ జ్వరం రావాలని దణ్ణాలు పెట్టేదాన్ని. వాళ్ళు రాకపోతే, టీచర్లు రాలేదు నేను వెళ్ళి లాభంలేదు" అని ఇంట్లో చెప్పచ్చని.

కానీ నా పప్పులేం పెద్దగా వుడికేవి కావు. అమ్మమ్మ అంటే హడల్. ..చచ్చినట్లు స్కూల్‌కి రెండోపూట కూడా వెళ్ళాల్సొచ్చేది.

అసలే సోషల్ స్టడీస్. అందులోనూ కడుపునిండా అన్నం తినొచ్చాక, మధ్యాహ్నం రెండో పిరేడ్ పెట్టచ్చా? జాన్ విల్సన్ సార్ 'మొహెంజదారో'నో, 'బింబిసారా'నో అనగానే, క్లాసులో కొన్ని గురకలు వినిపించేవి. అందులో ఒకటి సందానీది.

జాన్ విల్సన్ సార్ మహాగురి తప్పని విలుకాడులాంటివాడు. ఒలింపిక్స్‌కి వెళ్ళాల్సిన వాడు. చాక్‌పీస్ ముక్కలు నిద్రపోతున్నవాడికి తగిలేట్లు గురి పెట్టికొట్టి, వాడు కళ్ళు తెరిచాక, "రేయ్.. మరీ రైలు ఇంజన్‌లా అంత గురకేవిట్రా? ఇటొచ్చి నా పక్కన సీల్‌డౌన్ చెయ్యి" అనేవాడు.

సందానీ ఆయన పక్కన సీల్‌డౌన్ చేసి, ఆయన బోర్డ్ వైపు తిరగగానే, నెత్తిమీద కొమ్ముల్లా వేళ్ళు పెట్టుకుని ఆయనని వెక్కిరించడమో, ఆయన మాట్లాడుతుంటే, ఆయన వెనకాల ఆయన్ని అనుకరిస్తూ ముఖ కవళికలు మారుస్తూ ఏక్టింగ్ చెయ్యడమో చేస్తూ మమ్మల్ని నవ్వించేవాడు.

స్కూల్‌కి సందానీ రాకపోతే మాకు అస్సలుతోచేదికాదు.

నాకు మాత్రం అమ్మ త్వరగా ఆఫీసునుండి వచ్చేస్తే నన్ను వదిలేసి ఎక్కడ సినిమాకి వెళ్ళిపోతారో ఇంట్లో వాళ్ళు అని తెగ బెంగగా వుండేది. నాకు చిన్నప్పటి నుంచీ సినిమాల పిచ్చేగా మరీ.

"అక్కయ్యలూ, అన్నయ్యలూ అంతా డాక్టర్లూ, ఇంజనీర్లూ అవుతారు బాగా చదువుకుని... నువ్వేం అవుతావ్ స్కూల్ దుమ్మాలు కొట్టీ?" అని అమ్మమ్మ అడిగితే "పెళ్ళి చేసుకుంటా, అదీ సినిమా హాల్‌లో గేట్ దగ్గర టిక్కెట్లు చింపి లోపలికి పంపించేవాడిని" అని తడుముకోకుండా చెప్పేదాన్ని. పువ్వుపుట్టగానే పరిమళించును అని మా వాళ్ళు తెలుసుకోక అనవసరంగా నా వీపు విమానం మోత మోగించేవాళ్ళు.

కొన్నిసార్లు కేవలం హైదరాబాద్ చూడ్డానికి మాత్రమే కొంతమంది చుట్టాలొచ్చి దిగేవారు. అప్పుడు అమ్మ ఆఫీసులో కార్ బుక్ చేసేది. ఇంటిముందు కారు ఆగడం అంటే డెబ్బైలలో ఎంత గొప్పో?

సందానీ అయితే "ఒక్కసారి నాకీ ఎక్కిపించు" అంటూ దాని చుట్టూ తిరిగేవాడు.

అసలు మా ఫ్రెండ్స్ అందరినీ "నువ్వు మరి ఆ టీ.వీ హేమమాలిని జట్టు వుండనని ప్రామిస్ చెయ్యి" అనో, నా హోం వర్క్ రాసి పెడ్తావా మరి?" అనో, వాళ్ళ బలహీనతమీద దెబ్బ కొట్టి, ఒక్కసారి ఎక్కించి దింపేదాన్ని.

సందానీని ఒకసారి మాతోపాటు 'జూ'కి కూడా తీసుకెళ్ళాం. కానీ అక్కడ కోతులు వీడి చేష్టలకి కంగారు పడి నానా యాగీ చేసాయి.

నౌబత్ పహాడ్ అని బిర్లామందిర్ కట్టకపూర్వం అనేవాళ్ళు. దానికీ, పబ్లిక్ గార్డెన్స్‌కీ, చార్‌మినార్‌కీ, సాలార్‌జంగ్ మ్యూజియంకీ తీసుకెళ్ళేది చుట్టాలొస్తే అమ్మ.

సాలార్‌జంగ్ మ్యూజియంలో సరిగ్గా మధ్యాహ్నం పన్నెండుగంటలకి, గడియారంలో ఒక అబ్బాయొచ్చి బయటకి గంటకొట్టే బొమ్మవుండేది. దానిముందు పడిగాపులు పడి అది చూడ్డానికి జనం మూగేవాళ్ళు. అన్నీ విచిత్రాలుగా వుండేవి. ఏం తిన్నా మహత్తరంగా వుండేది. రంగు రంగుల గోలీ సోడా తాగినా, ఆరెంజ్ కలర్ గోల్డ్‌స్పాట్ తాగినా, కుండలోంచి కుల్ఫీ మిఠాయి తీసిచ్చినా, కొబ్బరి మిఠాయి కొనుక్కుతిన్నా, మిరపకాయ బజ్జీలు వేడివేడిగా వేయించుకున్నా ఆ రుచి మాములుగా వుండేదికాదు.

ఎగ్జిబిషన్ టైంలో ఇంటికెవరైనా వస్తే ఇంకా పండగ. సాయంత్రం ఎగ్జిబిషన్ స్పెషల్ బస్సులుండేవి. వాటిలో వెళ్తే, జైంట్ వీల్ ఎక్కుతాం అని పెద్దవాళ్ళ ప్రాణాలు తీసి తీరా ఎక్కాక భయంతో పొలికేకలు పెట్టేవాళ్ళం. అప్పుడే కొనుక్కుతిన్న మిరపకాయ బజ్జీలవీ కక్కేసే వాళ్ళం.

అమ్మమ్మ మా ప్రాణానికి, పెద్ద స్టీలు క్యారేజిలో దిబ్బ రొట్టో, పులిహోరో తీసుకొచ్చి, బాదం ఆకుల్లో పెట్టేది. జంపఖానా పరుచుకుని, కింద అలా కూర్చుని తినడం చాలా నామోషీగా వుండేది.

బొంబాయి మిఠాయీ, టిక్కుటిక్కూ, లాయి లప్పలూ, మా రిబ్బన్లూ, గాజులూ, అమ్మావాళ్ళు చీరలూ, కాలిజోళ్ళూ, పర్సులూ, అత్తరులూ, తప్పని సరిగా కొనే ఫోం దిండ్లూ ఇవన్నీ కొనుక్కుని, తిరిగి తిరిగి కాళ్ళు అరిగిపోయాక, బస్‌స్టాప్ కొచ్చి మళ్ళీ బస్సు కోసం పడిగాపులు. ఇప్పట్లా క్యాబ్‌లూ, ఆటోలూ లాంటి లగ్జరీస్ లేవు. అందరూ లోకల్ ట్రెయిన్లూ, బస్సులూ వాడేవారు. ఇంటిముందు ఇలా ఇన్నేసి స్కూటర్లూ, కార్లూ కావు. సైకిళ్ళు వుండేవి.

స్కూటర్ వుంటే వాళ్ళని శోభన్‌బాబుని చూసినట్లు చూసేవాళ్ళం.

ఆడపిల్లల కలలు కూడా మధ్య తరగతిగానే వుండేవి. స్కూటర్ మీద మొగుడితో వెళ్ళాలనీ, ఇంట్లో టేప్‌రికార్డరో, టూ ఇన్‌వన్నో వుండాలనీ, గ్యాస్ పొయ్యి, సీలింగ్ ఫ్యాన్ వుంటే వాళ్ళు గొప్పవాళ్ళనీ.. . ఇలా.. అసలు మా చిన్నప్పుడు మాకు కారున్న ఒక్క బంధువు కూడా లేరు.

మా అమ్మ మాత్రం బంధువుల అందర్లోకీ మొదటగా డైనింగ్ టేబుల్ కొంది. టీవీ కూడా వచ్చిన కొత్తల్లోనే తెచ్చింది. దాంతో శని ఆదివారాలు తీర్థ ప్రజల్లా ఇంటిమీద జనం పడడం వాళ్ళని అదుపు చెయ్యడం అది వేరే ప్రహసనం.

సందానీగాడైతే, మా ఇంట్లో టీ.వీలో సినిమాకి, వాడు టికెట్లు అమ్మేసుకుని, ఒకళ్ళనో, ఇద్దరినో వాడితో మా మామాకా బేటా, మా మౌసీకీ బేటా' అని తీసుకొచ్చేవాడు.

గురువారం చిత్రలహరికి కూడా వచ్చేసేవాళ్ళు చుట్టుపక్కలవాళ్ళు.

పట్టుచీరల ప్రదర్శనలలాంటి బృందగానాలూ, పాడుతున్న వాళ్ళు పట్టించుకోకపోయినా, చేతులూపుతూ తదాత్మ్యం చెందుతూ తల తిప్పే సంగీత దర్శకులూ....

అప్పుడప్పుడూ సంప్రదాయ నృత్యాలూ, మ్యాజిక్ షోలూ, అను నిత్యం పాడీ పంటాలో, నల్లబంకా, తెల్లపేనూ పంటలకి రాకుండా ఏం జల్లాలో చూపించే ప్రోగ్రాములూ ముచ్చట్లూ, జాబులూ జవాబులూ... 90ల దశకం అదో చరిత్ర. అదో ఉత్సవం.

ఇప్పుడు ఏదీ థ్రిల్ ఇవ్వటం లేదు పిల్లలకి. అందరికీ పుష్కలంగా డబ్బులు, బళ్ళు ఇంట్లోనే సినిమాలు, కోరిన ఫుడ్. కానీ ఆ రోజుల్లో మేం తిన్న తంపటేసిన పల్లీలూ, నిప్పులమీద కాల్చిన మొక్కజొన్న పొత్తులూ, చేతికి చుట్టిన జీళ్ళ గడియారాలూ, ఇంటిముందు కొచ్చిన పాల ఐసులూ, సబ్జాగింజలేసి ఇచ్చే వేసవి కాలపు చల్లని షర్బత్తులూ.. అప్పట్లో ఎంత రుచిగా వుండేవో.. అలాగే చూసిన బ్లాక్ అండ్ వైట్ మార్నింగ్ షోలు... మధ్యాహ్నం మేట్నీకి వెళ్ళి, టికెట్ కౌంటర్ క్లోజ్ అయిపోతే, లైన్‌లో ఫస్ట్ షోకి కంటిన్యూ అయి చూసిన శంకరాభరణాలూ, మరో చరిత్రలూ..

బోలెడు తినుబండారాలతో, మట్టు మరచెంబులో కాఫీలతో చేసిన రైలు ప్రయాణాలూ.. వానాకాలం రెయిన్ కోట్లూ... ఇంటిముందు పారే నీళ్ళలో కాయితం పడవలూ....సిగరెట్ పెట్టెలోని ముచ్చిత రేకుతో చేసుకున్న వెండి గిన్నెలూ, బొమ్మల పెళ్ళిళ్ళూ, మధ్యాహ్నాలు అష్టా చెమ్మా, చింతపిక్కలూ ఆడుకుంటుంటే అమ్మమ్మ పెట్టే తాయిలాలూ, సాయంత్రం అయ్యేసరికి వాకిట్లో పేడనీళ్ళు జల్లి, పిండి ముగ్గులు పెడితే, చల్లగాలికొచ్చే సువాసనలూ.. పరుగులెత్తి అలుపొచ్చేదాకా ఆడిన చెయిన్, కో ఆటా, కబడ్డీలు... అవన్నీ ఈ కంప్యూటర్ గేమ్స్, వీడియోల యుగంలో పిల్లలు మిస్ అయిపోతున్నారు.

ఎవరైనా అమ్మలు చందమామ రావే అంటూ చందమామని చూపించి పసిపిల్లలకి అన్నం పెడ్తున్నారా. కాశీ మజిలీ కథలు చెప్తున్నారా అమ్మమ్మలూ తాతయ్యలూ?

చంటి పిల్లల్లో చీకట్లోకి వెళ్తే బూచాడొస్తడనే భయం అమాయకత్వం కనిపిస్తున్నాయా?

ఏ.సీలు లేని వేసవి కాలం వట్టివేళ్ళ తడికల ఆహ్లాదం.. ఘుమఘుమలూ తెలుసా ఈ తరానికి?

Post your comments







